పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాణిక్‌రావు, , డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, తదితరులు

## ఆలయాల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావు పూజలు

జహీరాబాద్/ఝరాసంగం, డిసెంబర్ 22: మండలంలోని హుగ్గేల్లి, ఝరాసంగం మండలంలోని మచ్నూర్ గ్రామాల్లోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయాలను జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్ సందర్శించారు. ఆదివారం స్వామి, అమ్మవార్ల ఉత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి, మచ్చేందర్, నర్సింహాగౌడ్, అమీత్‌కుమార్, బండి మోహన్, ఎజాజ్‌పాషా, చిన్నారెడ్డి, రాథోడ్ బీమ్‌రావు, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా మహా అన్న సమారాధన

రామచంద్రాపురం, డిసెంబర్ 22: బీహెచ్ఈఎల్‌లోని అయ్యప్ప స్వామి ఆలయం ఆవరణంలో ఆదివారం మహా అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనలో వేలాదిగా అయ్యప్ప మాలధారణ స్వాములు, భక్తులు పాల్గొన్నారు. ఆలయ గురుస్వామి పరమేశ్వరన్ పిళ్లై నేతృత్వంలో 57వ మండలి పూజతో పాటు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన ప్రారంభించారు. అన్నసమారాధన కార్యక్రమంలో బీఆర్ఎస్ పటాన్‌చెరు నియోజకవర్గ నాయకుడు ఆదర్శ్‌రెడ్డి, ఇతర ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

అన్నసమారాధనలో బీఆర్ఎస్ నేత ఆదర్శ్‌రెడ్డి, అయ్యప్ప స్వాములు

## అ'పూర్వ' సమ్మేళనం

కోహీర్, డిసెంబర్ 22: మండలంలోని దిగ్వాల్ జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 2008 – 09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశలో నిలిచిన జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఆటపాటలతో హోరెత్తించారు. అనంతరం సహపంక్తి భోజనం చేశారు. రాజకీయాల్లో చేరి గ్రామాలను అభివృద్ధి చేయడంతోపాటు పేదలకు చేతనైన సహాయం చేయాలని హెచ్ఎం వీరన్న సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, యాదగిరి, వెంకటస్వామిగౌడ్, సతీశ్‌కుమార్, బాబురావు, శ్రీకాంత్‌రెడ్డి, విద్యార్థి నాయకులు దుర్గాప్రసాద్, రాములు, అశోక్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

## సిటిజన్ ఆన్‌లైన్ సేవలకు స్పందన

సిటిజన్ సేవలు పొందిన వారికి కార్డులు అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్

బొల్లారం, డిసెంబర్ 22: జిన్నారం మండలం కాజిపల్లి పారిశ్రామికవాడ గ్రామస్తుల కోసం ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఉచితంగా నిర్వహిస్తున్న సిటిజన్ ఆన్‌లైన్ సేవలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని ఫౌండేషన్ చైర్మన్ దండే రమాకాంత్ తెలిపారు. మొదటి రోజు ఆదివారం సిటిజన్ ఆన్‌లైన్ సర్వీసెస్ కార్యక్రమంలో వివిధ రకాల అంశాలకు సంబంధించిన సేవలు అందించారు. దాదాపు 183 మంది వివిధ రకాల సేవలు పొందినట్లు పేర్కొన్నారు. సోమవారం కూడా ఈ ప్రక్రియ కొనసాగుతుందని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అందోల్ గురుకులంలో ఆందోళన!

- శనివారం ధర్నాకు దిగిన విద్యార్థులు.. కలెక్టర్ హామీతో గప్‌చుప్
- ఆదివారం మరోసారి ధర్నాకు సిద్ధం.. పోలీసుల రాకతో సైలెంట్
- ప్రిన్సిపాల్ ఫిర్యాదుతో పార్ట్‌టైం ఉపాధ్యాయుడిపై కేసు నమోదు
- మంత్రి నియోజకవర్గంలో చర్చనీయంశంగా గురుకుల రాజకీయం

అందోల్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో శనివారం ధర్నా చేస్తున్న విద్యార్థినులు

అందోల్, డిసెంబర్ 22: అందోల్ సాంఘిక సంక్షేమ పాఠశాలలో ఏం జరుగుతున్నది? స్వయాన మంత్రి ఇలాఖాలో రెండు రోజులుగా గురుకుల విద్యార్థులు అందోళన చేస్తున్నారు. దీని వెనుక ఎవరున్నారనే అంశం ఇప్పుడూ చర్చనీయంశంగా మారుతున్నది. దీనికి సంబంధించి పార్ట్‌టైం ఉపాధ్యాయుడిపై ప్రిన్సిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జిల్లా అధికారులు ఈ విషయంపై అంతర్గంతంగా విచారణ చేపట్టడం హాట్ టాఫిక్‌గా మారింది. శనివారం విద్యార్థులు ప్రిన్సిపాల్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ ధర్నాకు దిగారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అదనపు కలెక్టర్ విచారణ జరిపి విద్యార్థులకు నచ్చజెప్పారు. అయినా ఆదివారం మరోసారి విద్యార్థులు ధర్నాకు సిద్ధంకాగా పోలీసులు కల్పించుకొని విద్యార్థులను లోపలికి పంపించారు. ఇదంతా ఏదో నాటకీయంగా కనబడుతున్నదని స్థానికులు, విద్యార్థుల తల్లితండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై మంత్రి ఎలాంటి చర్యలు తీసుకోనున్నారు. ఇది ఇంతటితో ఆగుతుందా, లేదా కొనసాగుతుందా తెలియాల్సి ఉన్నది. పాఠశాలలో పనిచేసే కొంతమంది పార్ట్ టైం సిబ్బంది సమయానికి విధులకు రావడం లేదని, వచ్చినా ఇష్టారీతిన పని చేస్తారని, ఇదేంటని అడిగితే కొంతమంది బయటి వ్యక్తులతో కలిసి రాజకీయం చేస్తున్నారని ప్రిన్సిపాల్ ఆరోపిస్తున్నారు. అమ్మాయిలు ఉండే పాఠశాలలోకి సాయంత్రం సైతం బయటి వ్యక్తులను పార్ట్ టైం వ్యక్తులు తీసుకువస్తున్నారని చెబుతున్నారు. గురుకులంలో మంచి విద్య లభిస్తుందని పిల్లలను చేర్పిస్తే వాళ్ల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

### పార్ట్‌టైం ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు నమోదు

గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఘటనలకు సంబంధించి ప్రిన్సిపాల్ సద్గుణమేరీగ్రేసి ఫిర్యాదు మేరకు పార్ట్‌టైం ఉపాధ్యాయుడు సతీశ్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు జోగిపేట ఎస్సై పాండు ఆదివారం తెలిపారు. విద్యార్థులు ధర్నాకు దిగేలా రెచ్చగొట్టి న్యూసెన్స్ చేయడం, వారితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## శ్రీనివాస రామానుజన్ సేవలు ఎనలేనివి

జహీరాబాద్, డిసెంబర్ 22: జహీరాబాద్ పట్టణంలోని వెలాసిటీ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జహీరాబాద్ పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందినే విద్యార్థులకు ట్యాలెంట్ పరీక్షలను నిర్వహించి, బహుమతులను నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు గణిత శాస్త్రవేత్తల ఫొటోలు, వారు గణిత శాస్త్రంలో చేసిన సేవలపై వెలాసిటీ డైరెక్టర్ రమేశ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్యాలెంట్ టెస్ట్ రాస్తున్న విద్యార్థులు

## జిన్నారంలో ఘనంగా సెమీ క్రిస్మస్

బొల్లారం, డిసెంబర్ 22: జిన్నారం మండల కేంద్రంలోని మహానయిమ్ మిని ట్రీస్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ జోసెఫ్ కొమ్మినేని జీసస్ క్రైస్ట్ లోకానికి అందించిన సేవలను సందేశంగా వినిపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు, భక్తి గీతాలను ఆలపించారు. స్థానిక నాయకులు, క్రైస్తవ సంఘం ప్రతినిధులతో కలిసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఏసుక్రీస్తు జీవిత చరిత్రపై చిన్నారులు సంస్కృతిక కార్యక్రమాల రూపంలో ప్రదర్శించి ఆహూతులను అలరించారు. అనంతరం నిర్వాహకులు యాదగిరి, నరేందర్ ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇజ్రాయిల్, అమృతవల్లి, మాజీ సర్పంచ్ యాదగిరి, యువజన నాయకులు నరేందర్ గౌడ్, మహిళలు, యువకులు, చిన్నారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న క్రైస్తవ ప్రతినిధులు

## బైక్‌ను ఢీకొట్టిన కంటైనర్.. ఇద్దరు మృతి

### ముత్తంగి హైవేపై ఘటన

పటాన్‌చెరు, డిసెంబర్ 22: బైక్‌పై వెళ్తున్న వ్యక్తులను వెనుకనుంచి వచ్చిన కంటైనర్ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన ముత్తంగిలో చోటు చేసుకుంది. పటాన్‌చెరు సీఐ వినాయకరెడ్డి తెలిపిన కథనం ప్రకారం.. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట్ గ్రామ పరిధిలోని ఎంకే ఇన్‌ఫ్రాలో నివసించే సివిల్ ఇంజినీర్ అశోక్‌కుమార్ ఆదివారం సంగారెడ్డి వెళ్లేందుకు భార్య నాగ శ్యామల(26), బంధువు నల్ల నాగ వినయ్(17)తో కలిసి స్కూటీపై బయలుదేరారు. ముత్తంగి రిలయన్స్ ట్రైండ్ వద్ద యూటర్న్ వద్దకు చేరగానే వెనకనుంచి అతివేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టింది. దీంతో డ్రైవింగ్ చేస్తున్న అశోక్‌కుమార్, ఆయన భార్య నాగశ్యామల, నాగ వినయ్ కింద పడిపోయారు. వెనుకనుంచి వచ్చిన లారీ నాగ శ్యామల, నాగ వినయ్‌ల పైనుంచి వెళ్లిపోయింది. దీంతో ఇద్దరికీ తీవ్ర గాయాలై ఘటనా స్థలంలోనే అక్కడికక్కడే మృతి చెందారు. భర్త అశోక్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ఈ ఘటనతో ట్రాఫిక్‌జాం ఏర్పడింది. జాతీయ రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో ట్రాఫిక్ క్లియర్ చేయడం పోలీసులకు కష్టంగా మారింది. రెండు మృతదేహాలను పటాన్‌చెరు పోలీసులు పటాన్‌చెరు ఏరియా దవాఖానాకు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. భర్త అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో నవనీత్‌కు సిల్వర్

రామచంద్రాపురం, డిసెంబర్ 22: అంతర్జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో భారతీనగర్ డివిజన్ ఎంఐజీకి చెందిన బొక్కన వనీత్ సిల్వర్ మెడల్ సాధించాడు. బంగ్లాదేశ్‌లో ఈనెల 17 నుంచి 21వ వరకు జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో నాగపూర్‌కి చెందిన రితికటక్కర్‌తో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో నవనీత్ అద్భుతంగా రాణించి ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించారు. ఈ సంవత్సరం నవనీత్ ఈజిప్ట్, ఉగాండాలో జరిగిన అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోట్లీల్లో పాల్గొని ఈజిప్ట్‌లో సిల్వర్ మెడల్, ఉగాండాలో బ్రాంజ్ మెడల్‌ని సాధించాడు. ఈ సందర్భంగా బ్యాడ్మింటన్ క్రీడాకారుడు నవనీత్ మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో జరిగిన బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ డబుల్స్‌లో సిల్వర్ మెడల్ సాధించడం సంతోషంగా ఉన్నదన్నారు. బ్యాడ్మింటన్‌లో మెరుగైన శిక్షణ, మెలకువలు నెర్చుకొని బంగారు పతకాన్ని సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బ్యాడ్మింటన్‌ని ప్రోత్సహించి తనకు సహకారం అందిస్తే రాష్ట్రానికి పేరు తెచ్చేలా అంతర్జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్‌లో రాణిస్తానని నవనీత్ అన్నారు.

బంగ్లాదేశ్‌లో మిక్స్‌డ్ డబుల్స్ బ్యాడ్మింటన్‌లో సిల్వర్ మెడల్ సాధించిన క్రీడాకారులు నవనీత్, రితి కటక్కర్

## అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

వట్‌పల్లిలో నిరసన తెలుపుతున్న జైభీమ్ సంఘం మండల నాయకులు

వట్‌పల్లి, డిసెంబర్ 22: పార్లమెంట్ సాక్షిగా రాజ్యంగా నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను అవమనించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే దేశానికి క్షమాపణ చెప్పాలని జైభీమ్ అధ్యక్షుడు చంటి అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వాఖ్యలను తీవ్రంగా ఖండించారు. జైభీమ్ సంఘం ఆధ్వర్యంలో అదివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ అంటే బీజేపీకి అక్కసు ఉందని, అమిత్‌షా వాఖ్యలను బట్టి తెలుస్తున్నదన్నారు. రాజ్యంగం మీద జరిగిన చర్చకు జవాబుగా నిండు సభలో రాజ్యగం, అంబేద్కర్‌ను అవమనపరిచిన అమిత్‌షా ఆ పదవిలో కొనసాగేందుకు అనర్హుడని పేర్కొన్నారు. వెంటనే మంత్రి పదవి నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. మండల యువజన అంబేద్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## జాతర పోస్టర్ ఆవిష్కరణ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

పటాన్‌చెరు, డిసెంబర్ 22: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ వద్ద గల భ్రమరాంబ కేతకి రేణుక ఎల్లమ్మ సమేత మల్లికార్జున(బండల మల్లన్న)స్వామి జాతర పోస్టర్‌ను ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆవిష్కరించారు. ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని ఆల్విన్ కాలనీలో జాతర నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, కార్పొరేటర్లు పోస్టర్లను విడుదల చేసి పూజలు చేశారు. జాతరను ఘనంగా నిర్వహించాలని, దానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. పటాన్‌చెరుతోపాటు నగరంలోని భక్తులు జాతరకు వస్తారని ఏర్పాట్లు ఘనంగా జరుపుతున్నామని నిర్వాహకులు తెలిపారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

సిద్దాపూర్‌లో రక్షణ కంచె లేకుండా పగుళ్లు తేలిన దిమ్మెపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ఝరాసంగం, డిసెంబర్ 22: మండల పరిధిలోని సిద్దాపూర్ శివారులోని వైకుంఠ ధామం ఎదుట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె పగుళ్లు రావడంతోపాటు రక్షణ కంచె లేక ప్రమాదకరంగా మారింది. ఫ్యూజ్ బాక్స్ వైర్లు చేతికి అందేలా ఉండడంతో అటుగా వెళ్లే స్థానికులు, మేతకు వచ్చే మూగజీవులకు ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్ అధికారులు సమస్యను గుర్తించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు పగిలిన దిమ్మెను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

ఝరాసంగం, డిసెంబర్ 22: మండల పరిధిలోని బిడెకన్నె గ్రామంలో పేకాట ఆడుతున్న స్థావరంపై ఆదివారం సాయంత్రం దాడి నిర్వహించి ఐదుగురిని అరెస్ట్ చేశామని స్థానిక ఎస్సై నరేశ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3,170 నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. వారిని అరెస్ట్ చేసి ఝరాసంగం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

## జీవితంపై విరక్తి చెంది వ్యక్తి ఆత్మహత్య

కోహీర్, డిసెంబర్ 22: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకొన్న ఘటన మండలంలోని దిగ్వాల్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సతీశ్ కథనం ప్రకారం.. దిగ్వాల్ గ్రామానికి చెందిన లేడి సుభాశ్(40) తన భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో తాగుడుకు బానిసయ్యాడు. శనివారం రాత్రి గ్రామ సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సతీశ్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించి కుటుంబస భ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## జహీరాబాద్‌లో నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్, డిసెంబర్ 22: జహీరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికుల సూచనలు, సమస్యలు తెలుసుకునేందుకు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానిక డిపో మేనేజర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు 99592 26269కు ఫోన్ చేసి సలహాలు, సూచనలు ఇవ్వాలని పేర్కొన్నారు.

## నేడు జాతీయ రైతు దినోత్సవం

గుమ్మడిదల, డిసెంబర్ 22: భారతదేశ మాజీ ప్రధానమంత్రి చౌదరి చరణ్‌సింగ్ జయంతిని పురస్కరించుకొని జాతీయ రైతు దినోత్సవాన్ని మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని రైతు సంఘం మండల అధ్యక్షుడు పోచుగారి మోహన్‌రెడ్డి తెలిపారు. ప్రతి ఏడాది దేశ మాజీ ప్రధాని చౌదరి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా మండలంలోని గ్రామాల్లో మంచి దిగుబడి సాధించిన యువ రైతులను ఆదర్శ రైతులుగా గుర్తించి సన్మానిస్తామని పేర్కొన్నారు. రైతులకు సహకరిస్తున్న వ్యవసాయ, రెవెన్యూ, బ్యాంకు, సహకార సంఘం అధికారులను సైతం సత్కరిస్తామని తెలిపారు.

## సిద్దిపేటలో ప్రజావాణి వాయిదా

సిద్దిపేట కలెక్టరేట్, డిసెంబర్ 22: సోమవారం నిర్వహించే ప్రజావాణి అనివార్య వారణాల వల్ల మంగళవారానికి వాయిదా వేసినట్లు సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని గమనించి ప్రజావాణి కార్యక్రమానికి రావాలనుకునే వారు మంగళవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానాకి వచ్చి సమస్యల పరిష్కారానికి అర్జీలు పెట్టుకోవాలని కోరారు.

## అనఘు శతకం ఆవిష్కరణ

సిద్దిపేట టౌన్, డిసెంబర్ 22: సమాజాన్ని మేల్కొల్పడంలో పద్యం చిరస్థాయిగా నిలుస్తుందని జాతీయ స్థాయి పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐతా చంద్రయ్య అన్నారు. సిద్దిపేట పాత గ్రంథాలయ ఆవరణలో ప్రముఖ కవి బండికాడి అంజయ్య గౌడ్ రచించిన అనఘు శతక పరిచయం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా చంద్రయ్య మాట్లాడుతూ.. దేశం బాగుపడాలంటే సంస్కృతి సంప్రదాయ రచనలు రావాలన్నారు. పాత్య పుస్తకాల్లో పద్య సాహిత్యాన్ని చేర్చాలన్నారు. కార్యక్రమంలో జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు రాజమౌళి, ప్రధాన కార్యదర్శి రాజేశం, లక్ష్మయ్య, బస్వరాజ్‌కుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## సామాజిక విలువలను పెంపొందించాలి

సిద్దిపేట టౌన్,డిసెంబర్ 22: మానవ సమాజంలో నైతిక విలువల పెంపునకు కృషి చేయాలని రచయిత నందిన భగవన్ రెడ్డి అన్నారు. మంజీరా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో మంజీరా స్వరం అనే అంశంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులం, మతం, ప్రాంతం అనే భావనలు అసమానత, అనైక్యతకు దారి తీస్తాయన్నారు. సాంస్కృతిక చైతన్యం ద్వారానే సామాజిక రుగ్మతల నిర్మూలన సాధ్యమన్నారు. పాపయ్య మాట్లాడుతూ.. ప్రస్తుత రాజకీయ వ్యవస్థ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నదని వాపోయారు. అనంతరం జరిగిన చర్చగోష్ఠిలో సంఘం జిల్లా అధ్యక్షుడు రంగాచారి, యాదగిరి, శ్రీనివాస్, యాదగిరి, రాజశేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, రాజు పాల్గొన్నారు.

# ప్రయాణం.. నరకప్రాయం

- గుంతలతో అధ్వానంగా తయారైన రహదారులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, ప్రయాణికులు

గుంతలుగా మారిన మేదపల్లికి వెళ్లే రోడ్డు

ఝరాసంగం, డిసెంబర్ 22: రహదారులు పట్టణాలు, పల్లెల ప్రగతికి సూచికలు అంటారు. కానీ, ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినప్పటికీ రోడ్లు అభివృద్ధికి నోచుకోకపోవడంతో నిత్యం వాహనదారులు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రమైన ఝరాసంగం నుంచి మేదపల్లి, ఈదులపల్లి, సిద్దాపూర్, బద్దిపూర్, చిలేపల్లి తండా, ప్యారవరం, వనంపల్లి, భోజ్యనాయక్ తండా, పుర్యనాయక్ తండా, బోప్పన్‌పల్లి, బోరెగావ్, జీర్లపల్లి, చిలేమామిడి గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలు పడి, రాళ్లు తేలి అధ్వానంగా తయారయ్యాయి.

### తరుచూ ప్రమాదాలు

ఈ రోడ్లపై నిత్యం వందలాది వాహనాలు, వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి వేళలో గుంతలు కనిపించక, సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరిగిన పలు సంఘటనలు అనేకం ఉన్నాయి. గుంతలు ఏర్పడడంతో తమ వాహనాలు చెడిపోతున్నాయని, టైర్లు పగిలిపోతున్యాయని, పంక్చర్ అవుతున్నాయని ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు. ప్రయాణ సమయంతో పాటు పెట్రోలు, డీజిల్ ఖర్చు పెరుగుతున్నదని చెబుతున్నారు. కార్లు, ఆటోలు, ద్విచక్ర వాహనాలపై కొన్ని కిలోమీటర్లు వెళ్లేసరికి ఒళ్లు హూనమవుతుందని వాపోతున్నారు. తండాల నుంచి ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చే గర్భిణులు రోడ్డు మధ్యలోనే ప్రసవం జరిగిన ఘటనలు సైతం ఉన్నాయి. కొత్త రోడ్డు వేసేలోగా ముందుగా మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఈదులపల్లి నుంచి దిగ్వాల్ వెళ్లే రోడ్డు దుస్థితి

## పాడైన రోడ్లను బాగు చేయించండి

రోడ్లు చాలా వరకు దెబ్బతిని గుంతలు పడ్డాయి. దుమ్ము దూళిలో ప్రయాణిస్తూ అవస్థలు పడుతున్నాం. ఈ రోడ్ల దుస్థితిపై అధికారులకు, నాయకులకు వినతిపత్రాలు ఇచ్చినా ఎలాంటి స్పందన రావడం లేదు. గుమ్మడిదల పీఆర్ఏఈ శశిధర్ రెడ్డి ఝరాసంగం మండలానికి ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నా ఎప్పుడూ అందుబాటులో ఉండడం లేదు. మా మండలానికి రెగ్యులర్ పీఆర్ఏఈని నియమించాలి. రోడ్లను బాగు చేసి వాహనదారుల ఇబ్బందులు తీర్చాలి.

*- నర్సింహులు, మేదపల్లి గ్రామం*

## ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం

వనాకాలంలో భారీ వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలుగా మారాయి. ఈ రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైన వెంటనే రోడ్ల మరమ్మతులకు అంచనాలు వేసి టెండర్లు పిలిచి పనులు ప్రరంభిస్తాం. వాహనదారుల ఇక్కట్లు తీరుస్తాం.

*- శశిధర్ రెడ్డి, పీఆర్ఏఈ*